తెలుగు జ్యోతి రచనలపోటీలో ప్రథమ బహుమతి పొందిన
స్వానుభవ శీర్షిక పురస్కార ప్రదాతలు సిలికానాంధ్ర సంస్థ

# అమ్మా - నాన్న - మరుపులేని అనుభూతి

*- డొక్కా రాఘువ*

మధ్య తరగతి సాంప్రదాయ కుటుంబంలో పెరిగాను నేను.  ఆ రోజుల్లో మాది చిన్న కుటుంబం అనే చెప్పచ్చు.. నేను, మా అన్నయ్య, మా చిన్న చెల్లెలు.. బాల్య స్మృతులు మధురంగా తలుచు కోడానికి సరి పోయేటంత సంపద. యాభైసంవత్సరాల క్రితం మధ్య తరగతి కుటుంబంలో ఉండే క్రమశిక్షణ మా ఇంట్లో కూడా ఉండేది.  మేము నిత్యజీవితంలో నేర్చుకోవలసిన పాఠాలకి మా నాన్నగారు కొన్ని విచిత్రమైన పద్ధతులు వాడేవారు... అవి ఒక్కోసారి కఠినంగా ఉండేవి. జీవితమంతా నన్ను నడిపించిన, నేను మర్చిపోలేని సంఘటన ఇది.



అది నేను మద్రాసులో కేసరిహైస్కూల్లో ఆరవతరగతిలో చేరిన మొదటి రోజు.. ప్రొద్దున్నే మా నాన్నగారు నన్ను పిలిచి, "నీకు చదవడం వచ్చు కదా!'' అని అడిగారు.

"ఐదోక్లాస్ అందరికంటే ఎక్కువ మార్కులతో పాసైన నన్ను అలా అడుగుతారేంటి?'' అనుకుంటూ నేను సంకోచంగా తలూపాను.  వెంటనే ఆయన చేత్తో రాసిన ఒక మాప్ డ్రాయింగ్ కాగితం ఇచ్చారు. అందులో వీధులపేర్లు, మా ఇంటినించి కేసరి స్కూల్‌కి ఎలా వెళ్ళాలో.. వివరంగా రాసుంది.  అయోమయంగా ఆయన కేసి చూశాను.  ఒకసారి కాగితంకేసి చూసి తల ఊపారు. అంటే నేను ఆమాప్ చూసి ఒక మైలు దూరంలో ఉన్న స్కూల్‌కి నడుచు కుంటూ వెళ్ళాలన్న మాట.  అప్పటి వరకూ ఇంటిప్రక్కన ఉన్న చిన్న బడికి తప్ప ఒక్కణ్ణీ ఎక్కడికీ ఇల్లు వదిలి వెళ్ళలేదు.  ఆ తలూపడంలో "ఎక్కడా ఆగకు, పరుగెత్తకు, వెనుతిరిగి రాకు'' అన్నమూడు సందేశా లున్నాయి. నాకు కాళ్ళల్లో వణుకు.. ఒళ్ళంతా చెమట్లు మొదలయ్యాయి.

అదేమీ పట్టించుకోనట్లు నన్ను తలుపుబైట వదిలి "వెళ్ళిరా'' అని తలుపేసుకున్నారు మా నాన్నగారు.  నేను కాసేపు అలాగే నిలబడి, కళ్ళల్లో నీళ్ళు ధారాపాతంగా కారుతుండగా, నడక మొదలెట్టాను.  అలా ఎంతసేపు నడిచానో, ఎన్నిసార్లు భయపడ్డానో, ఎంత గాభరాపడ్డానో.. అదేమీ గుర్తు లేదుకానీ, అంత దూరంలో స్కూల్ బిల్డింగ్ కనిపించగానే కలిగిన ఆనందం మాత్రం బాగా జ్ఞాపకం ఉంది.

**--- మిగతా 33వ పేజీలో**



Telugu Jyothi Special Issue April 08

ఇప్పుడు ఇండియాలో డిస్లెక్సియా పిల్లలకి చాలా స్కూల్స్ వచ్చాయి. ఒక స్కూల్లో పెయింటింగ్ నేర్పించడానికి నాకు అవకాశం వచ్చింది. ఇదంతా కంప్యూటర్ ద్వారానే పప్పీ సహాయంతో. ఇంక నేను మళ్ళీ రాలేను. ఇన్నాళ్ళు ఇల్లీగల్‌గా ఉన్నా కదా! నాకు బ్రతికున్నంతకాలం డబ్బు సరిపోయేలాగ నాన్నగారు ఏర్పాటు చేశారు. నాలా ఒంటరితనం అనుభవించే పిల్లలకి నేను ఓదార్పు ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. ఆ డబ్బు వాడి, ఆ పిల్లలకి స్పీచ్ థెరపీలు చేయిస్తాను. వాళ్ళకి ఎందులో ప్రతిభ ఉందో అందులో రాణించేలా చూస్తాను. పగులున్న కుండని కదా! వీలయినంత మందికి ఆహ్లాదాన్ని కలిగిస్తాను. ఇట్లు- ప్రేమతో నీ అక్క".

ఆ ఉత్తరం చదివాక చల్లని గాలి సోకిన మేఘం లాగా మేఘన "అక్కా" అంటూ కదిలి కదిలి ఏడ్చింది.

***మంథా భానుమతి***

ప్రస్తుత నివాసం హైదరాబాదు. కెమిస్ట్రీ లెక్చరర్‌గా రిటైర్ అయ్యారు. వివిధ పత్రికలలో కథలు వ్రాస్తూ ఉంటారు. రచన, స్వాతి, ఆంధ్రభూమి నవలల పోటీలలో బహుమతులు గెల్చుకున్నారు.

---

## అమ్మ-నాన్న మరువు లేని అనుభూతి...

### తరువాయి భాగం

స్కూల్ గేటు ముందు సంతోషంతో వేసిన గంతులు.. ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత సంబరం...

అప్పుడూ కళ్ళల్లో నీళ్ళు కారాయి గర్వంతో.. ఎలా మర్చిపోగలను?

ఇంటికి వచ్చాక నాన్నగారు రాకుండానే పడుకున్నా.. పొద్దున్నే లేచి.. ఆయన ఏమంటారో అని ఆత్రంగా దగ్గరికి వెళ్ళాను. "రీసెస్‌లో ఆడుతుంటే నిన్ను చూశాను. బాగ ఎంజాయ్ చేశావా? ఫస్ట్ డే" అని అడిగారు. ఎన్నో విషయాలు మాట్లాడారు.. ఒక్క స్కూల్‌కి ఎలా వెళ్ళానో అనితప్ప.

కొన్నేళ్ళతర్వాత మా అమ్మని ధైర్యం తెచ్చుకుని "అలా ఒక్కణ్ణే ఎలా పంపారమ్మా?" అని అడిగాను. "నువ్వు వెళ్ళిన వెంటనే నీకు కనిపించకుండా నీ వెనకాలే వచ్చారు.. నువ్వు స్కూల్ కనిపించగానే అనుభవించిన ఆనందం ఆయన కూడా అనుభవించారు." అంది అమ్మ కొంతసేపు నామొహం లోకి చూసి. అలాంటి తండ్రిని, ఆయన ప్రేమని, మార్గదర్శకత్వాన్ని బాల్యం వీడకుండానే కోల్పోయినందుకు కళ్ళల్లో తిరిగిన నీళ్ళని ఆపుకున్నాను అమ్మ బాధపడుతుందని. అదే ధైర్యాన్ని నా పిల్లలకి అందించేలాగ తీర్చిదిద్దిన అమ్మ ప్రేమకి కొలమానం ఉందా?

***డొక్కా రాఘువ***

డిఫెన్స్ మినిస్ట్రీలో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా చేసి ప్రస్తుతం రిటైర్ అయ్యారు. హైదరాబాదులో నివాసం.



Telugu Jyothi Special Issue April 08